సమకాలీనం

# 'తొండి' రాజకీయాలు - ప్రజల ఆశలూ!!

**అంతర్జాతీయ** మాతృభాషా దినోత్సవం ఫిబ్రవరి 21న విజయవాడలో జరిగిన ఒక సభలో హర్‌మొహిందర్‌సింగ్ సాహ్ని అనే ఒక సిక్కు పంజాబీ, తన యాసలోనే అయినా చక్కని తెలుగులో మాట్లాడుతూ "66 ఏళ్ళ క్రితం బెంగాలీ జాతిని విడగొట్టారు, పంజాబీ జాతిని విడగొట్టారు. ఇపుడు తెలుగుజాతిని విడగొట్టారు. ఒక జాతిని విడగొడితే ఎలాంటి వేదన ఉంటుందో ఎరిగినవాడిగా నేటి పరిణామాలకు విచారిస్తున్నాను" అన్నారు. 1947లో జరిగినదాన్ని దేశ విభజనగా మాత్రమే చెప్పి, జాతుల విభజన అంశాన్ని కప్పిపుచ్చే వారున్నారు. ఉపఖండంలోనే కాదు నాటి బ్రిటీషు, అమెరికన్ సామ్రాజ్యవాదులు చైనా, వియత్నాం, కొరియా, పాలస్తీనా, జర్మనీలను కూడా విడగొట్టారు. తన పరాధీన దేశాలను, జాతులను అణచివుంచటం, చీల్చటం సామ్రాజ్యవాదపు సహజ లక్షణమని ఎరగనివారెవరూ లేరు. అయితే ప్రపంచీకరణ (ఎల్.పి.జి.) పేరిట సరికొత్తగా ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక దురాక్రమణను కొనసాగించ పూనుకున్న మార్కెట్టు శక్తులు ఆంధ్రప్రదేశ్‌ను తమ ప్రయోగశాలగా గత 25 ఏళ్ళుగా చేసుకున్నారనే విషయంతో కలిపి అర్థం చేసుకున్నప్పుడే నేటి పరిణామాలను సక్రమంగా బేరీజువేయగలుగుతాము. సామ్రాజ్యవాదపు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్యాలనుండి బయటపడలేని ఏ జాతీ నిజమైన అర్థంలో వికాసాన్నీ, స్వంతకాళ్ళపై నిలబడగలిగిన స్వయం నిర్ణయ వ్యక్తిత్వాన్నీ సాధించలేదని గత నూరేళ్ళ ప్రపంచ చరిత్ర చాటి చెబుతోంది.

బలమైన జాతీయ పునాదులు గల ఆధునిక పారిశ్రామిక వ్యవస్థను నిర్మించుకోవటానికి అవరోధమైన కాలంచెల్లిన భూస్వామిక సంబంధాల నుండి తెలుగుజాతి నేటికీ బయటపడలేదు. కుల, మత, ప్రాంతీయ అసమానతలను రూపుమాపుకోలేదు. విదేశీ దోపిడీ నుండి బడా బూర్జువాల ఆధిపత్యం నుండి విడగొట్టుకోలేదు. తన జాతి భాషలోనే తన ప్రజలను పరిపాలించే కనీస ప్రజాస్వామికతత్వాన్ని కూడా ఇన్నేళ్ళుగా ఏలిన తెలుగు పరిపాలకులు ప్రదర్శించలేదు. ఫలితంగా ఆర్థిక అసమానతలు, అధికధరలు, అవినీతి, నిరుద్యోగం, పొలాల సాగుకు, మనుషుల దాహార్తికీ నీళ్ళు లేకపోయినా పుష్కలంగా మద్యం తాగుడుతోసహా క్షీణ - పతన సాంస్కృతిక విలువలు, మహిళలపై భయంకరమైన హింసలు, లైంగికదాడులు ఇటు తెలుగూ రాని, అటు ఇంగ్లీషురాని రెంటికి చెడ్డ రేవడలతో రాష్ట్రం నిండిపోయింది. వీటన్నిటితో బలహీనపడిన జాతిని, వీటికి వ్యతిరేకంగా పోరాటంద్వారానే ఐక్యం చేయగలుగుతామనే, బలోపేతం చేయగలగుతామనే రాజకీయ చింతన కూడా బలహీనంగా వుంది. కుళ్ళి, కంపుకొడుతున్న నేటి అర్ధవలస - అర్ధఫ్యూడల్ వ్యవస్థను సమైక్యంగా కొనసాగించినా, ప్రత్యేకాలుగా పరిపాలించినా ప్రజల జీవితాలలో వచ్చే మౌలిక మార్పులేమీ వుండవు.

సరిగ్గా 45 సంవత్సరాల క్రితం మార్క్సిస్టు మేధావి తరిమెల నాగిరెడ్డి ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీకి రాజీనామా చేస్తూ "ఈనాటి అసెంబ్లీలు, పార్లమెంట్లు బాతాఖానీ షాపులు"న్నాడు. కనీసచర్చ (బాతాఖానీ) లేదు సరికదా ఓటింగు కూడా లేకుండా ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లును రాష్ట్ర అసెంబ్లీ తిరస్కరిస్తే, కేంద్రంలో పార్లమెంటు ఆమోదించింది. కాంగ్రెసు నాయకుడు జయపాల్‌రెడ్డి హైదరాబాదు అసెంబ్లీలో జరిగిన తిరస్కరణకు సరిగ్గానే 'తొండి' అని పేరుపెట్టాడు. మరి పార్లమెంటులో జరిగినదంతా ప్రజాస్వామికమా జయపాల్‌రెడ్డిగారూ!! 21 నిమిషాలలో తేల్చగలిగిన వివాదాన్ని 14 సంవత్సరాలపాటు ఎవరు, ఎందుకు కొనసాగనిచ్చారు? ప్రపంచీకరణ మార్కెట్ శక్తుల దుర్మార్గాలను ఒకే జాతిగా ఎదుర్కోవాల్సిన కాలంలో ప్రాంతీయ అసమాతనత్వాలకు కారకులైన పాలకవర్గాలూ వారి రాజకీయ ముఠాలే ప్రజల పేరిట అధికార కుమ్ములాట లాడుకున్నారు. తెలుగుజాతిని బహుళజాతి కంపెనీలు, అంబానీలు నిట్టనిలువునా దోచుకుపోతుంటే పట్టనట్టు, ఎగరనట్టూ నటిస్తున్నారు. సమైక్యం - ప్రత్యేకం పేరిట మారీచుల్లా ప్రవర్తించారు.

కాంగ్రెసుపార్టీ-భారతీయ జనతాపార్టీలను పరస్పర విరుద్ధమైనవిగా భావించే రాజకీయ అమాయకులు మనకు చాలామందే వున్నారు. కానీ విదేశీ బహుళజాతి కంపెనీలకూ, అంబానీల్లాంటి బడా దోపిడీదార్ల ప్రయోజనాలను కాపాడటంలో ఆ రెండూ ఒకటేనని అంగీకరించేవారు కూడా వున్నారు. దోపిడీ పాలకవర్గాలకు ప్రాతినిధ్యంవహించే దేశవ్యాపిత పార్టీలుగా(వాటినే జాతీయ పార్టీలంటున్నారు) అవి రెండూ వున్నాయి. వెంటాడుతున్న ఆర్థిక - రాజకీయ సంక్షోభం ఫలితంగా ఏ ఒక్క రాజకీయ పార్టీకి పార్లమెంటులో మెజారిటీ వచ్చే పరిస్థితి గత 20 ఏళ్ళుగా దేశంలో లేదు. అందరూ 'కులగూరగంప' రాజకీయాలే నడపాలి. ఇలాంటి రాజకీయ బలహీనతలో కేంద్ర ప్రభుత్వాలుండగా, ఆంధ్రప్రదేశ్‌లో 2002నాటి విద్యుత్ వ్యతిరేక ఉద్యమానికి మించిన బలమైన ప్రజాఉద్యమాలు చెలరేగి నిలదొక్కుకుంటే ప్రమాదకరమన్నది కూడా పాలకవర్గాలకు తెలుసు. సామ్రాజ్యవాదులకు బడా పెట్టుబడిదార్లకు తమ దేశవ్యాపిత దోపిడీ ప్రయోజనాలకు ప్రమాదం కాగల బలమైన జాతులు, తమనెదిరించగల రాష్ట్రప్రభుత్వాలు ఉండకూడదు. బా.జ.పా. వారి చిన్న రాష్ట్రాల విధాన నిర్ణయం వెనుకనున్న 'గంభీర' రాజకీయమంతా యిదే. రాష్ట్రాలను కీలుబొమ్మలుగా ఆడించటం కాంగ్రెసు మార్క్‌రాజకీయమని ఇన్నేళ్ళ చరిత్రా చెబుతూనే వుంది. అనేక జాతులు నివశించే భారతదేశాన్ని "ఒకే జాతి" (భారతజాతి)గా నిర్వచించిన పాలకవర్గాల సైద్ధాంతికతలో కూడా దేశవ్యాపిత దోపిడీశక్తుల ప్రయోజనాలే వున్నాయి.

ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే యువకులకు మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని, నల్లగొండ జిల్లాకు చెందిన 23ఏళ్ళ శ్రీకాంతాచారి 4ఏళ్ళ క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమను కొడుకు వీడిపోయినా అతడి ఆశలు నెరవేరాలని కోరుకుంటూ శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ... **"అన్ని స్థాయిలలో ప్రైవేటు విద్యను, ప్రైవేటు వైద్యాన్ని రద్దుపరిచి ప్రభుత్వపరంగావిస్తేనే ప్రజలకు మేలు జరుగుతుంది. తెలంగాణాలో పుట్టిన ప్రతిబిడ్డా నాణ్యమైన ఉచిత విద్యను అన్ని స్థాయిలలో పొందాలి. ఏ పేదవాడూ కార్పొరేట్ హాస్పిటళ్ళలో ఫీజులు చెల్లించలేక మరణించకూడదు"** అన్నట్టుగా హిందూ పత్రిక విలేఖరి రాశాడు. (23-2-2014)

ప్రజల కనీస ఆకాంక్షలను శంకరమ్మ వ్యక్తంచేశారు. ప్రజలకు వారిదైన మాతృభాషలో విద్యనూ-పరిపాలననూ అందిస్తామనే హామీనైనా యివ్వటానికి సిద్ధపడని సమైక్య - ప్రత్యేక దొరలు శ్రీకాంతాచారి, అతని తల్లి శంకరమ్మల కనీస ఆశలనైనా నెరవేరుస్తారా? 40 ఏళ్ళ క్రితం శ్రీశ్రీ అన్నట్టు బానిసకొక, బానిసకొక, బానిసలమని అనిపించుకోకుండా వుండగలుగుతారా??

**24-2-2014** **- దివికుమార్**